యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభకు తరలిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సభకు వెళ్తున్న యుటిఎఫ్ నేతలు

కాకినాడలో జరుగుతున్న యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవ మహాసభకు జీలుగుమిల్లి మండలం నుంచి యుటిఎఫ్ సభ్యులు ఆదివారం ఉదయం తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు యుటిఎఫ్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. అనంతరం కార్లలో ర్యాలీగా బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. వెళ్లిన వారిలో జిల్లా కార్యదర్శి ఎ.రాజు, జిల్లా, మండల సభ్యులు ఎన్.చెన్నారావు, ఎం.పోసమ్మ, ఆర్.సోమేశ్వరరావు, సిహెచ్.భవానిశంకర్, ఆర్.వెంకటేశ్వరరావు, కె.రామతులసి, ఎస్.సత్యవతి, ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

'మెడికల్స్'లో మాయాజాలం..!

- మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ముందుకు
- కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వని పరిస్థితి
- మందుల నాణ్యతపై అనేక అనుమానాలు
- డాక్టర్ చీటిలేకుండానే పెద్ద ఎత్తున విక్రయాలు
- నిత్యం రూ.కోట్లలో వ్యాపారం సాగే చోట పర్యవేక్షణ కరువు
- అధికారుల, ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు
- రెండు జిల్లాలో దాదాపు మూడు వేల మెడికల్ స్టోర్‌లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మనుషుల ప్రాణాలకు విలువలేకుండా పోయింది. ప్రజలకు అత్యంత ముఖ్యమైన మందులు (ఔషధాలు) విక్రయించే షాపులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అత్యధిక మందుల షాపులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మెడికల్ స్టోర్‌లు ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ రూ.కోట్లలో మందుల వ్యాపారం జరుగుతోంది. ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. జంక్‌ఫుడ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. తాగునీరు కలుషితంగా మారింది. దీంతో జనాలను రోగాలు పట్టిపీడిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతోపాటు, షుగర్, బిపి, కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు సైతం రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2024 నవంబర్ నుంచి రెండు జిల్లాల్లో ఆరోగ్యశాఖ చేస్తున్న స్క్రీనింగ్ పరీక్షల ఫలితాలను చూస్తే రోగాల తీవ్ర ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ప్రతి వంద మందిలో ఒకరు కేన్సర్ అనుమానితులుగా తేలుతున్నారు. రెండు లక్షల 24 వేల మందిని స్క్రీనింగ్ చేస్తే దాదాపు 50 వేల బిపి, షుగర్ కేసులు బయటపడుతున్నాయి. పసిపిల్లలు సైతం అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. 40 ఏళ్లు దాటిన వారు ప్రతి రోజూ టాబ్లెట్లు మింగకపోతే ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. మందులు కొనుగోలు చేసే మెడికల్ స్టోర్స్‌లో సరైన నిబంధనలు పాటించకపోయినా అడిగే నాథుడే లేకుండా పోయాడు. పట్టణాలు, పల్లెలు అనితేడా లేకుండా అత్యధిక మెడికల్ స్టోర్లలో కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా అడిగితే చిన్న కాగితపు ముక్కపై కేవలం ఎంతయ్యిందో రాసి మాత్రం ఇస్తున్నారు. గట్టిగా మాట్లాడితే బిల్లు ఇస్తే ఎక్కువ ఖర్చు అవుతుందని చెబుతున్న మెడికల్ స్టోర్ల యాజమానులు ఉన్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో డ్రంగ్ కంట్రోల్ కార్యాలయం ఉంది. ఏలూరు పట్టణంలో అతిపెద్ద మెడికల్ షాపుల్లో కూడా ఎక్కడా కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపన పోవడం లేదు. చాలా దుకాణాల్లో ఫార్మాసిస్టులు లేకుండా నడుస్తున్నాయంటూ చర్చ కొనసాగుతోంది.

డాక్టర్ చీటీ లేకుండానే మందుల విక్రయాలు..

నిబంధనల ప్రకారం డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదు. చాలా మెడికల్ స్టోర్స్‌లో డాక్టర్ చీటీతో సంబంధం లేకుండా మందుల విక్రయం ఎక్కువగా సాగుతోంది. జ్వరాలకు, కీళ్ల నొప్పుల సంబంధించిన మందులు, యాంటీ బయోటిక్స్ సైతం డాక్టర్ చీటీలేకుండా ఇచ్చేస్తున్నారు. రూపాయి ఖరీదు చేసే మందు బిళ్లకు రూ. ఐదు అంతకంటే ఎక్కువగానే వసూలు చేస్తున్నారు. పది టాబెట్ల మందుల షీట్ మొత్తం తీసుకుంటే ధర కొంతమేర తెలిసే అవకాశం ఉంటుంది. రెండు, మూడు టాబెట్లు ఇచ్చినప్పుడు ధర గురించే తెలిసే అవకాశమే లేకుండా పోతుంది. దీంతో మెడికల్ స్టోర్స్‌లో దోపిడీకి అంతులేకుండా పోతోంది. చాలా ఆసుపత్రుల్లో అనుబంధంగా మెడికల్ స్టోర్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆ డాక్టర్ రాసిన మందులు అక్కడే కొనుగోలు చేయాలి. ఎక్కడా కొనుగోలు చేయకూడదు. వారు ఎంత ధర నిర్ణయిస్తే ఆ ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీనిపై మాట్లాడిన వారే లేకుండా పోయారు. ఆసుపత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న మందుల దుకాణాలకు అసలు అనుమతులు ఉంటున్నాయో లేవో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. చాలా దుకాణాలు వేరే ఫార్మాసిస్టుల సర్టిఫికెట్లతో నడిచిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు ఫార్మా కంపెనీలతో కుమ్మక్కై నాణ్యతలేని మందులు సైతం విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు చేస్తున్నారా, చేస్తే ఎటువంటి కేసులు నమోదు చేశారు, చర్యలు ఏమైనా తీసుకున్నారా అనేది ఏఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది. డ్రగ్స్ అధికారులు సైతం పజలకు అవగాహన కల్పించే విధంగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు సైతం డ్రగ్స్ కంట్రోల్ శాఖకు సంబంధించి సమీక్షా సమావేశాలు జరిపిన దాఖలాలు కనిపించడం లేదు. సిబ్బంది తక్కువగా ఉన్నారన్న నెపంతో పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. మనుషుల ప్రాణాలకు సంబంధించి మందులు విక్రయించే మెడికల్ షాపులపై నిఘా పెంచాలని, నిరంతరం దాడులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

హాస్టల్ భవనాల మరమ్మతులకు రూ.5.72 కోట్లు నిధుల విడుదల

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాల మరమ్మతులకు ఐదు కోట్ల 72 లక్షల రూపాయల నిధులు విడుదలైనట్లు ఏలూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ తెలిపారు. జిల్లాలో మొత్తం ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు సకాలంలో విడుదలవుతున్నాయా, భవనాల మరమ్మతులు ఎప్పటికి పూర్తి చేస్తారు? వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : ఏలూరు జిల్లాలో ఎన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?

జిల్లాలో మొత్తం 59 హాస్టళ్లు ఉన్నాయి. అందులో బాలురకు 21, బాలికలకు 38 హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 6000 మంది విద్యార్థులు వసతి గృహాల్లో ఉండి చదువుతున్నారు.

ప్రశ్న: ఏ తరగతి నుంచి ఏ తరగతి వరకూ హాస్టల్ సౌకర్యం ఉంది? కళాశాల హాస్టల్స్ ఎన్ని ఉన్నాయి?

పాఠశాల స్థాయిలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకూ హాస్టల్ సౌకర్యం ఉంది. అలాగే కళాశాల హాస్టల్స్ కూడా 18 ఉన్నాయి. ఇంటర్, డిగ్రీ, ఇతర కోర్సులు చేసే విద్యార్థులు ఈ హాస్టల్స్‌లో ఉండి చదువుకుంటారు.

ప్రశ్న: విద్యార్థులకు మెస్ ఛార్జీలు ఎలా ఇస్తున్నారు? ఇప్పటివరకూ పెండింగ్ ఏమైనా ఉందా?

ఐదో తరగతి వరకూ ప్రతి విద్యార్థికి నెలకు వెయ్యి రూపాయలు, ఆరు నుంచి పదో తరగతి వరకూ 1200 రూపాయలు, కళాశాల విద్యార్థులకు 1,450 రూపాయలు చొప్పున ప్రభుత్వం మెస్ ఛార్జీలు అందిస్తుంది. వీటిని నేరుగా హాస్టల్‌కు సరుకులు సప్లై చేసే దుకాణదారుల ఖాతాలో వేయడం జరుగుతుంది. ఒక్క గ్యాస్‌కు మాత్రం వార్డెన్ అకౌంట్లో వేయడం జరుగుతుంది.

ప్రశ్న : కాస్మోటిక్ ఛార్జీలు ఎవరి అకౌంట్లో వేస్తున్నారు, ఇప్పటి వరకూ పెండింగ్ ఏమైనా ఉందా?

కాస్మెటిక్ ఛార్జీలు ప్రతినెలా విద్యార్థి బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరుగుతుంది. ప్రస్తుతానికి ఎలాంటి పెండింగ్ లేదు.

ప్రశ్న : జిల్లాలోని 59 హాస్టళ్లలో రెగ్యులర్ వార్డెన్లు ఎంతమంది ఉన్నారు? అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు? వారికి రెగ్యులర్‌గా జీతాలు ఇస్తున్నారా?

జిల్లాలో 42 మంది వార్డెన్లు రెగ్యులర్‌గా ఉండగా మిగిలిన వారు పూర్తి అదనపు బాధ్యతల్లో పనిచేస్తున్నారు. అలాగే నాలుగో తరగతి ఉద్యోగులు అవుట్సోర్సింగ్‌తో కలిపి 210 మంది ఉన్నారు. వారికి ఎలాంటి జీతాలు పెండింగ్ లేవు.

ప్రశ్న: జిల్లాలోని అన్ని హాస్టల్ భవనాలూ శిథిలావస్థకు చేసిన నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం మరమ్మతులకు ఎంత నిధులు విడుదల చేసింది? ఏ శాఖ ద్వారా పనులు నిర్వహిస్తున్నారు?

మరమ్మతుల నిమిత్తం ఐదు కోట్ల 72 లక్షల రూపాయలు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనులను పంచాయతీ, ఆర్అండ్‌బి, సర్వ శిక్ష అభియాన్ ఇంజినీరింగ్ సెక్షన్ తదితర శాఖలకు అప్పగించడం జరిగింది. మేము కేవలం పర్యవేక్షణ చేయడం మాత్రమే.

ప్రశ్న: మరమ్మతులకు ఎన్ని భవనాలను గుర్తించారు? ఏయే పనులు చేపడుతున్నారు?

జిల్లాలో 42 భవనాలు మరమ్మతులకు గుర్తించాం. మరుగుదొడ్లు, తాగునీరు పైప్‌లైన్స్, రూఫ్ లీకేజ్, తలుపులు కిటికీలు వంటి పనులు చేపట్టాం.

ప్రశ్న : సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా డిఎస్‌సి అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది? ఇది ఎంతవరకూ వచ్చింది?

ప్రస్తుతం డిఎస్‌సి నోటిఫికేషన్ రాని కారణంగా కోచింగ్ ఇంకా ప్రారంభించలేదు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రారంభిస్తాం.

ప్రశ్న: పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఎంత రావాల్సి ఉంది? ఎప్పటిలోగా విడుదలవుతాయి? జిల్లాలో ఎంతమందికి రావాల్సి ఉంది?

జిల్లాలో 12,000 మంది ఎస్‌సి విద్యార్థులకు, ఎస్‌టి, బిసితో కలిపి 39 వేల మందికి ఇంటర్ డిగ్రీ ఇతర వృత్తి విద్యా కోర్సులు చేసే వారికి 71 కోట్ల రూపాయలు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు రావాల్సి ఉంది. ఈ నెలాఖరుకు మంజూరు కావొచ్చు.

ప్రశ్న: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఇంటర్ పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచడానికి ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుంది. అలాగే వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై వ్యక్తిగత శ్రద్ధతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుంది.

అల్లూరి స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

- ప్రతినబూనిన ప్రతినిధులు
- ముగిసిన సిపిఎం 26వ జిల్లా మహాసభ
- జిల్లా సమగ్రాభివృద్ధికి మహాసభ ప్రధాన డిమాండ్
- 14 తీర్మానాలకు ఆమోదం
- నూతన జిల్లా కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్
- 25 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

మంతెన సీతారాం

సమావేశంలో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిపిఎం 26వ జిల్లా మహాసభ ఉత్తేజభరిత వాతావరణంలో ముగిసింది. మూడేళ్ల ఉద్యమం సాధించిన ప్రగతి.. భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికపై ప్రతినిధులు విస్తృత చర్చలు జరిపి జిల్లాలో ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించింది. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని నిర్ణయించింది. రాబోయే రోజుల్లో అల్లూరి స్ఫూర్తితో సమరశీల పోరాటాలు సాగిస్తామని ప్రతినిధులు ప్రతినబూనారు. జిల్లా ప్రగతికి, సమగ్ర అభివృద్ధితోపాటు కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యవసాయ, రైతు, కౌలురైతు, స్కీమ్ వర్కర్లు, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం సమస్యల పరిష్కారానికి 20 అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ అంశాలపై పోరాటాలు సాగించేందుకు ఐక్య ఉద్యమాలకు మహాసభ నాంది పలికింది.

సిపిఎం 26వ జిల్లా మహాసభ ఆదివారంతో ముగిసింది. మహాసభ మొదటి రోజు శుక్రవారం భారీ ప్రజాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి ముగింపు, జిల్లా మహాసభ సందర్భంగా కొత్త బస్టాండ్ కేశవరావు హైస్కూల్ నుంచి పాత బస్టాండ్ వరకూ మహాప్రజా ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సిపిఎం శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్‌వర్కర్లు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజానీకం సైతం వేలాదిగా తరలొచ్చి విజయవంతం చేశారు. పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభ జయప్రదంగా సాగింది.

రెండో రోజు శనివారం ఆర్ఎస్ నగర్ (ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం)లో వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో ప్రతినిధుల సభ జరిగింది. సిపిఎం సీనియర్ నేత, చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతినిధుల సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా ప్రతినిధులు చర్చల్లో పాల్గొని ఆమోదించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

సిపిఎం నూతన జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. సిపిఎం 26వ జిల్లా మహాసభలో ప్రతినిధులు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా బి.బలరాం, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, బురిడి వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా దూసి కళ్యాణి, ధనికొండ శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, ముచ్చర్ల త్రిమూర్తులు, కానేటి బాలరాజు, సూర్నీడు వెంకటేశ్వరరావు, ఎ.అజయకుమారి, పొగాకు పూర్ణ, కె.తవిటినాయుడు, కేతా పద్మజ, కె.క్రాంతిబాబు, కామన మునిస్వామి, ఎకెవిఆర్.భద్రం, శేషపు అశ్రియ్య, ఇంజేటి శ్రీనివాసు ఎన్నికయ్యారు. ఈ ప్రక్రియను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం పర్యవేక్షించారు. ఇప్పటివరకూ జిల్లా కమిటీ సభ్యులుగా ఉండి రిలీవైన కె.రాజా రామ్మోహన్‌రాయ్, జవ్వాది శ్రీనివాస్, బిజి.మూర్తి, బాతిరెడ్డి జార్జి, ఎం.వైకుంఠరావుకు నూతన జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రానున్న కాలంలో జిల్లాలో ప్రజా సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానంగా కాలుష్యం సమస్య వేధిస్తోందని, తాగునీటి జలాలు కలుషితమై జనం రోగాల పాలవుతున్నారన్నారు. శుద్ధి చేసిన నీటిని ప్రభుత్వం అందించాలన్నారు. ప్రభుత్వ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

మహాసభ ఆమోదించిన తీర్మానాలు..

1.జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలి.
2.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలి.
3.వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి. ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.
4.అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
5.సామాజిక న్యాయం అమలు చేయాలి. దళితులు, దళితపేటల అభివృద్ధికి కృషి చేయాలి.
6.బాలికలు, మహిళలపై అత్యాచారాలను, దాడులను అరికట్టాలి. భద్రత కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
7.పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించాలి. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి.
8.నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణానికి మూడు సెంట్లు స్థలం, రూ.5 లక్షల సహాయం అందించాలి.
9.పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. కాలువల ఆధునికీకరణ పూర్తి చేయాలి. రైతాంగ సమస్యలు పరిష్కరించాలి.
10.నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి.
11.సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి.
12.యువతకు ఉపాధి కల్పించాలి. క్రీడా మైదానాలను ఏర్పాటు చేసే క్రీడలను ప్రోత్సహించాలి.
13.వడ్డిలంక స్లూయిస్, లక్ష్మీపాలెం లాకుల మరమ్మతులు చేపట్టాలి. ముంపు సమస్యను పరిష్కరించాలి.
14.వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి.

నిర్వాసితులకు పాత ప్యాకేజీ చెల్లించడం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పాత ప్యాకేజీ ప్రభుత్వం చెల్లించడంపై సిపిఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. స్థానిక పవర్‌పేటలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఎప్పుడో నిర్ణయించిన పాత రేట్లను కొన్ని ప్రాంతాల్లో నిర్వాసితులకు ప్రభుత్వం ఇస్తుందని, నిర్వాసితుల అభిప్రాయం తీసుకోకుండా, వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా బ్యాంకుల్లో ఆ మొత్తాన్ని జమ చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. బ్యాంకు ఖాతాల్లో పాత రేట్లను జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని వ్యాఖ్యానించారు. 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.6.86 లక్షలుగా ప్యాకేజీని ప్రకటించిందని తెలిపారు. 2022లో సిపిఎం, ప్రజల ఆందోళనతో జగన్ ప్రభుత్వం ప్యాకేజీని రూ.10లక్షలకు పెంచిందన్నారు. కాని గత, ప్రస్తుత ప్రభుత్వాలు పెంచిన దాన్ని అమలు చేయకుండా అన్యాయం చేశాయని విమర్శించారు. అలాగే 41.75 మీటర్ల వద్ద అశాస్త్రీయంగా నిర్ణయించిన కాంటూరు లెక్కల ప్రకారం కొన్ని గ్రామాలకే పరిహారం ఇవ్వడాన్ని కూడా సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసికే ఇవ్వాలి

7న విజయవాడలో రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిపిఆర్.దొర, తదితరులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసిలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసికే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఏడో తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఆర్‌టిసి స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు డిపో కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు గ్యారేజ్ వద్ద ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2029 నాటికి వంద శాతం విద్యుత్ బస్సులుగా మార్చాలని జిఒ ఇచ్చిందని, రాష్ట్రంలోని 11 ప్రధాన నగరాల్లో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయించిందని తెలిపారు. ఇవి పూర్తిగా ప్రయివేట్ బస్సులేనని, వీటిలో పనిచేసేవారంతా ప్రయివేట్ సిబ్బందేనని, విద్యుత్ బస్సుల పేరుతో ఆర్‌టిసిని పూర్తిగా ప్రయివేటీకరించడమేనన్నారు. ఈ పాటికే ఆర్‌టిసిలో ఉన్న 11,216 బస్సుల్లో 2,751 బస్సులు అద్దె బస్సులు ఉన్నాయని, ప్రస్తుతానికి రానున్న 750 విద్యుత్ బస్సులు వల్ల 3700 వరకు ఆర్‌టిసి ఉద్యోగులు, డ్రైవర్లు, మెకానిక్‌లు, కండక్టర్లు మిగులు తేల్చబడతారని, వీరికి ఉద్యోగ భద్రత ఉండదని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా విద్యుత్ బస్సులను ఆర్‌టిసి ద్వారా నిర్వహిస్తే ఇవన్నీ ప్రభుత్వ బస్సులు అవుతాయని, ఆర్‌టిసిలో ప్రస్తుతం అత్యంత నైపుణ్యం గల డ్రైవర్లు, అంకిత భావంతో పనిచేసే సిబ్బంది ఉన్నారని, ప్రజలకు సౌకర్యవంతమైన, చౌకైన రవాణా అందుబాటులో ఉంటుందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, అలా కాకుండా 2029 నాటికి అన్ని ప్రయివేట్ విద్యుత్ బస్సులే వస్తే ఆర్‌టిసి ఉద్యోగుల ఉద్యోగాలకు భద్రత ఉండదని, ప్రజలకు కూడా దీనివల్ల ఛార్జీల భారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కృష్ణా మాస్టారుకు గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డు

ప్రజాశక్తి - దెందులూరు

ఎంపియుపి స్కూల్ ఇందిరా కాలనీ ఏలూరులో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గగ్గులోతు కృష్ణకు మదర్‌థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం వారు గురు బ్రహ్మ రాష్ట్ర అవార్డు 2024కు ఎంపిక చేశారు. ఈ అవార్డును ఆదివారం ఉదయం ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) చేతులమీదుగా క్యాంపు కార్యాలయంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి చేసిన సేవల్లో భాగంగా కృష్ణ మాస్టారును రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు. మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం వారు మాట్లాడుతూ కృష్ణ మాస్టారు విద్యారంగానికి చేసిన సేవలను గుర్తించి గురుబ్రహ్మ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాస్టార్‌ను పలువురు అభినందించారు. అవార్డు గ్రహీత కృష్ణ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తనకు అందించిన అవార్డులు, ప్రశంసాపత్రాలను తన జీవితంలో మరిచిపోలేనివన్నారు. ఈ అవార్డులతో తనకు మరింత బాధ్యతలు పెరిగాయని తెలిపారు.


అవార్డు అందుకుంటున్న కృష్ణ మాస్టారు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

విద్యుత్ ఛార్జీల పెంపుపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచడం, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టటం పరిపాటిగా మారిందని సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై, వ్యవసాయ విద్యుత్ పంపు సెట్లు బిగించడంపై మండల కేంద్రమైన మండలం సెంటర్ వద్ద నిరసనగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొడవలి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం ఆదాని లాభాల కోసమేనన్నారు. పేదలపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల రమేష్, శివప్రసాద్, దుర్గారావు, శ్రీను, పిల్లి మురళీ, గంగుల సత్యం, కటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రముఖులు

పిఎంపిలకు వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఆనందం సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం స్థానిక విహార్ రోటో రెస్టారెంట్ కాన్ఫరెన్స్ హాలులో ఏలూరు, దెందులూరు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల సభ్యులకు వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక ఎస్‌విఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ నాగ రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఎముకలు, నరాలకు సంబంధించి పిఎంపిలు చేసే ప్రాథమిక వైద్యం గురించి వివరించారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిటి.రాజు మాట్లాడుతూ సభ్యులు ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలపై విజ్ఞానం పొంది తమ పరిధిలోనే చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లోజు జయరామతో పాటు సుమారు 85 మంది సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఉదయ్‌భాస్కర్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా జంగారెడ్డిగూడెం తహశీల్దార్ కార్యాలయ డిటి జి.ఉదయ్‌భాస్కర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన డిప్యూటీ తహశీల్దార్ సందీప్ పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడటంతో కలెక్టర్ అతన్ని సస్పెండ్ చేశారు. అనంతరం ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా జంగారెడ్డిగూడెం తహశీల్దార్ స్లీవజోజి ఇన్‌ఛార్జిగా నియమించారు. అయితే జంగారెడ్డిగూడెం మేజర్ మండలం కావడంతో ఆయన ఇక్కడకు రావడం కుదరకపోవడంతో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా జి.ఉదయ్‌భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

టైగర్స్ క్లబ్ పోలవరం అసెంబ్లీ కన్వీనర్‌గా బాషా

ప్రజాశక్తి - పోలవరం

ఏలూరు టైగర్స్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ పోలవరం అసెంబ్లీ కన్వీనర్‌గా ప్రముఖ స్వచ్ఛంద సేవకులు మానవతీవిత అవార్డు గ్రహీత షేక్ మెహబూబ్ బాషా ఎంపిక పట్ల పోలవరం మండలంలో పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు, బిజెపి, జనసేన నాయకులు, ప్రెస్ క్లబ్ సభ్యులు మెహబూబ్ బాషాకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు బుగ్గా మురళీకృష్ణ మాట్లాడుతూ కరోనా విపత్తు కాలంలో కోవిడ్‌తో మృతి చెందిన వారిని బంధువులు, రక్త సంబంధీకులు సైతం ముట్టుకోవడానికి భయపడిన సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మృతదేహాల దహన, ఖనన కార్యక్రమాలు నిర్వహించి తన సేవా నిరతిని చాటుకున్నారని తెలిపారు.

పాఠశాల లోగో ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నూజివీడులో ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ లోగో ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ కళాశాలల డైరెక్టర్లు మేడ మోహనరావు, మేడా శ్రీ హర్ష, గొల్లపూడి రవిబాబు, కేంద్రీయ విద్యాలయం విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ మేడా సీతారామయ్య తదితరులు ఒకేజీ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు తుమ్మల వెంకటేశ్వరరావు చేతులమీదుగా లోగో ఆవిష్కరించారు. పాఠశాల లోగోను ఆవిష్కరించడంతో పాటు, పాఠశాలకు సంబంధించిన వెబ్ పేజీని, బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముఖ్యఅతిథి, ఒకేజీ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు తుమ్మల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఉన్న పాఠశాలల పనితీరు ఇప్పుడు మెరుగుపడిందని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పాఠశాల యాజమాన్యాలు నూతన పద్ధతులను పాటిస్తున్నాయన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైతం టీవీలు, సెల్ ఫోన్లకు అలవాటు పడి తాము చేయాల్సిన పనులను పక్కన పెడుతున్నారన్నారు. ఆధునిక సౌకర్యాలతో విద్యార్థులకు ఉత్తమమైన, నాణ్యమైన విద్యను అందించినప్పుడే భావి భారత పౌరులను తీర్చిదిద్దగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి అనగాని చంద్రరావు, అనగాని వెంకటేశ్వరరావు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పివిఎస్ భోగేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కెఎండి.ఆరిఫ్, నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

దుమ్ముతో ప్రజల ఇబ్బందులు..!

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల ప్రజలు రోడ్డుపై దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కునూరు నుంచి భద్రాచలం వెళ్లే రహదారిపై దుమ్ము లేచిపోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన కుక్కునూరు-భద్రాచలం రహదారి పనుల వల్ల రోడ్డుపై దుమ్ము లేచిపోతుంది. బస్సు కాని, లారీ కానీ వెళ్తే దాని వెనకాల మరో వాహనం వస్తే కనపడని పరిస్థితి నెలకొంది. ఇటీవల రాజీవ్ నగరం ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్‌కు ప్రమాదం తప్పింది. ఎదురుగా వస్తున్న లారీతో పాటు దాని వెనకాల దుమ్ము లేగటంతో డ్రైవర్‌కు రోడ్డు కనిపించకపోవడం వల్ల ట్రాక్టర్ రోడ్డు పక్కకు దిగిపోయింది. త్రుటిలో డ్రైవర్‌కు పెను ప్రమాదం తప్పింది. బోనగిరి వద్ద ఓ టిడిపి నాయకుడికి బ్రేక్ అదుపుతప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇక రహదారి పక్కన ఉన్న ఇళ్లపై, పంటపొలాలపై దుమ్ము పేరుకుపోతుంది. లంకలపల్లి నుంచి పెదరాయిగూడెం వరకు సుమారు 35 కిలోమీటర్ల మేరకు దూరం ఉండటం వల్ల నీటి తడుపుడు సరిపోవటం లేదు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించటానికి సంబంధిత అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ కారులో కాకుండా బైక్‌పై వస్తూ పరిశీలించాలని మండల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి మళ్లీ పది సంవత్సరాలు వరకు గుర్తుండి పోయేలా ఉంటుంది కాని అంతకంటే ముందు దుమ్ముతో ఈ ఇబ్బందులు ఎదుర్కోలేకపోతున్నామని ప్రజలు,

రోడ్డుపై లేస్తున్న దుమ్ము

వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ఎంఎల్‌ఎ ఈ విషయమై దృష్టి పెట్టి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కుక్కునూరు మండల ప్రజలు కోరుతున్నారు.

అఖిల భారత నెట్‌బాల్ టోర్నీకి కృష్ణా వర్సిటీ జట్టు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కృష్ణా విశ్వవిద్యాలయం నెట్‌బాల్ మహిళల జట్టును ఎంఆర్‌ఎఆర్ కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నవీన లావణ్య లత ఆదివారం ప్రకటించారు. ఎంపికైన ఈ జట్టు జనవరి ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు జైపూర్‌లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో జరుగనున్న అఖిల భారత అంతర విశ్వావిద్యాలయాల నెట్‌బాల్ మహిళల టోర్నమెంట్‌లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు సభ్యుల వివరాలు తెలిపారు.

అఖిల భారత నెట్‌బాల్ టోర్నీకి ఎంపికైన కృష్ణా వర్సిటీ జట్టు

ఎస్.శ్రావంతి, జి.రెచల్, కె.సాయిదుర్గా, టి.మౌనిక, కె.వల్లిశ్రీ, బి.లిఖిత (ఎస్‌ఆర్‌ఆర్, సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), సిహెచ్.శ్రీజ, జి.ధనశ్రీ, వి.రమిత, బి.నవ్య (శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల), వి.శ్రీవర్షిత (ఆంధ్రా లయోలా కళాశాల), ఎస్.లీలపద్మజ (డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ గవర్నమెంట్ కాలేజీ) ఎంపికైనట్లు తెలిపారు. ఈ జట్టుకు కోచ్‌గా డి.సత్యనారాయణ, మేనేజర్ డి.నవీన్‌కుమార్ వ్యవహరిస్తారు. జట్టు సభ్యులకు కళాశాల వ్యాయామ విద్యా సంచాలకులు శశాంక్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేమ పేరుతో యువకుడి మోసం

ఫ్యాన్‌కు ఉరేసుకుని యువతి మృతి

తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

ప్రేమ పేరుతో తమ కుమార్తెను మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వీరికి సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. వివరాల్లోకెళితే.. ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని యువతి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. లక్ష్మణేశ్వరం ప్రగతి నగర్‌కు చెందిన టంకాని లక్ష్మీకుమారి(19) తన గదిలో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఉండటాన్ని చూసి ఆమె సోదరి గమనించి కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై నరసాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు

ఎంఎల్‌ఎ నాయకర్‌తో చర్చిస్తున్న కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు

ఆదివారం నరసాపురం ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వీరికి ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆందోళనకు మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. పోడూరు ఎస్ఐ కె.సుధాకర్ రెడ్డి, నరసాపురం పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకటసురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎంతకీ కుటుంబ సభ్యులు ఆందోళన విరమించుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, సిపిఎం నాయకులు 216 జాతీయ రహదారిపై రుస్తుంబాద వద్ద రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి జాతీయ రహదారిపై చేరుకున్నారు. నిందితులను అరెస్టు చేయాలని, కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అప్పటివరకు ఆందోళన విరమించలేదని రోడ్డుపై బైఠాయించారు. ఆత్మహత్య కారకులైన నిందితులను అరెస్ట్ చేస్తామని, కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, పకృతి ప్రేమికులు బీచ్‌కు ఉదయమే ప్రత్యేక ద్విచక్ర వాహనాలతో తరలివచ్చారు. సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై నిలబడి ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

సముద్రతీరాన పర్యాటకుల సందడి

గ్రామీణ పేదలందరినీ సంఘటితం చేద్దాం

పోరాటాలను విస్తృతంగా నడుపుదాం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు

గ్రామీణ పేదలందర్నీ సమీకరించి సమరశీల ఉద్యమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరులో నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అనేక నూతన మార్పులు వస్తున్నాయని, ఫ్యూడల్ వ్యవసాయం నుంచి కార్పొరేట్ వ్యవసాయంగా దిశగా మారుతుందని, దానిని అధ్యయనం చేసి అందులో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పనులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దాని అనుబంధ రంగాలైన వివిధ రకాల పనులు వ్యవసాయ కార్మికుల కుటుంబాలు చేస్తున్నాయని వారందరి ఆదాయం వస్తేనే ఆ కుటుంబ జీవనం గడిచే పరిస్థితి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు సామాజిక బాధ్యతలను విస్మరించినందున విద్య, వైద్యం, మౌలిక వస్తువులన్నీ పేదలకు దూరమవుతున్నాయన్నారు. ఆహార భద్రత కరువైందని, ప్రజా పంపిణీ వ్యవస్థను పాలకులు ధ్వంసం చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగ పరిరక్షణ జరిగితేనే ఆహార భద్రత లభిస్తుందని, అందుకు వ్యవసాయ రంగం మీద ఆధారపడి పనిచేస్తున్న అన్ని తరగతుల ప్రజలను సమీకరించాలని ఆయన అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధుల పెంపు కోసం పోరాటాలు కొనసాగించాలని అన్నారు. పాలకులు ప్రభుత్వ రంగానంతా ప్రయివేట్ పరం చేస్తున్నందున దళితులు అణగారిన తరగతులు వ్యవసాయ కూలీల కుటుంబాలకు విద్య ఉపాధి అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు నేడు అత్యంత అవసరమైందన్నారు. సామాజిక న్యాయానికి సమాధి కడుతున్న బిజెపి మతోన్మాద భావజాలాన్ని ప్రతిఘటించాలన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు విశాల ఐక్యవేదికలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది మహిళలు ఉన్నా వారందరికీ రూ.1500 చొప్పున ఇస్తామన్న అంశాలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి 16 రకాల నిత్యావసర వస్తువులను చౌక ధరల దుకాణాలు ద్వారా ప్రజలకు అందించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్యసభలో అవమానంగా మాట్లాడటాన్నీ తీవ్రంగా ఖండించారు. తక్షణమే కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శిక్షణా తరగతుల ముగింపు సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఎస్.మహంకాళిరావు, తామా ముత్యాలమ్మ, ఉడతా వెంకటేష్, సముద్రల సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆసుపత్రుల దోపిడీ..!

విచ్చలవిడిగా గుర్తింపు లేని క్లినిక్‌లు

ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో వైద్య రంగం గందరగోళ పరిస్థితుల్లో ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు సరిపోకపోవడం, నిర్లక్ష్య ధోరణి అధికంగా ఉండటం, ఆరోగ్యశ్రీలో కొన్ని ముఖ్యమైన రోగాలకు చికిత్స లేని పరిస్థితి ప్రజలను ప్రయివేట్ ఆసుపత్రుల వైపు నెట్టివేసింది. ఈ పరిస్థితిని అర్హతలేని ఆర్‌ఎంపి డాక్టర్లు, ప్రయివేట్ క్లినిక్‌లు ఉపయోగించుకుంటూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం, మందులు అందకపోవడం, ఆపరేషన్లకు అవసరమైన పరికరాలు కొరత వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ప్రయివేట్ ఆసుపత్రుల చేతుల్లో దోపిడీ సాధనంగా మారింది. కొన్ని రకాల చికిత్సలు ఆరోగ్యశ్రీ కవరేజీ లేక ప్రయివేట్ ఆసుపత్రుల్లో భారీ ఖర్చులు పెట్టడం సాధారణంగా మారింది.

గుర్తింపు లేని క్లినిక్‌ల పెరుగుదల

ప్రభుత్వం గుర్తించని ప్రాథమిక చికిత్స కేంద్రాలు అనేక గ్రామాల్లో వేగంగా విస్తరిస్తున్నాయి. వీటిలో అర్హత లేని ఆర్‌ఎంపి డాక్టర్లు మెడికల్ శిక్షణ లేకుండానే ప్రయివేట్ ఆసుపత్రులు నడుపుతున్నారు. మెడికల్ షాపులో పనిచేసి ప్రాథమిక క్లినిక్స్ నడపడం వీరి అర్హత. చిన్న చిన్న ప్రాథమిక చికిత్సల పేరుతో వారు యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ వంటి ప్రమాదకరమైన మందులను ఇస్తూ ప్రజల ఆరోగ్యానికి నష్టం చేస్తున్నారు.

ప్రయివేట్ ఆసుపత్రుల దోపిడీ

ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక చిన్న చికిత్సకే వేల రూపాయలు తీసుకుంటుండటంతో ప్రజలు ఎక్కువ అప్పుల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు సమర్థంగా పనిచేస్తే ప్రయివేట్ ఆసుపత్రుల దోపిడీకి తావు ఉండేది కాదు.

పరిష్కార మార్గాలు

ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధి చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, పరికరాలు, వైద్యుల సంఖ్య పెంచాలి. ఆరోగ్యశ్రీ కవరేజీని విస్తరించి మరిన్ని రోగాలకు చికిత్స అందేలా చేయాలి. గుర్తింపు లేని క్లినిక్‌ల నియంత్రణ, ప్రతి క్లినిక్‌ను నమోదు చేసి వాటిపై పర్యవేక్షణ చేయాలి. అర్హత లేని ఆర్‌ఎంపి డాక్టర్లను విధుల నుంచి తొలగించాలి. ప్రయివేట్ ఆసుపత్రులపై నియంత్రణ ఫీజులు నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలి. ప్రజలకు న్యాయమైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకో వాలి. ముమ్మందు చర్యలు అవసరం ప్రభుత్వ వైద్య రంగం బలపడితేనే ప్రజలు ప్రయివేట్ ఆసుపత్రుల దోపిడీ నుంచి తప్పించుకోగలరు. ప్రజల ఆరోగ్యం పరిరక్షించడం ప్రభుత్వ తొలి బాధ్యత కావాలి. ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఆరోగ్య సమాజ నిర్మాణానికి నాంది. అనర్హుల వైద్య సేవల నియంత్రణకు కఠిన చట్టాల అవసరం.

ప్రయివేట్ వైద్య రంగంలో అనర్హులైన వ్యక్తుల కల్లోలం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే వీరి కార్యకలాపాలను నియంత్రించేందుకు పలు చట్టాలు ఉన్నా, అమలు ప్రక్రియలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం 2010 ప్రకారం ప్రతి ఆసుపత్రి, క్లినిక్ లేదా డయగ్నోస్టిక్ సెంటర్ ప్రభుత్వ అనుమతిని పొందాల్సి ఉంటుంది. అయితే జిల్లాల్లో అనేక గుర్తింపు లేని ఆసుపత్రులు నిర్బంధంగా పని చేస్తున్నాయి. ఇక డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 ప్రకారం వైద్యుల ఆదేశం లేకుండా ప్రమాదకర ఔషధాలు విక్రయించకూడదని నిర్దేశించినా అనేక ప్రయివేట్ క్లినిక్‌లు ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయి. యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ వంటి మందుల వినియోగం నియంత్రణలో మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం (1956) ప్రకారం ఎంబిబిఎస్ లేదా గుర్తింపు పొందిన మెడికల్ డిగ్రీ కలిగిన వ్యక్తులు మాత్రమే వైద్య సేవలు అందించవచ్చు. అయినా, అనర్హులైన వ్యక్తులు ఈ నియమాలను ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అదేవిధంగా క్వాక్స్ నియంత్రణ చట్టాలు ప్రకారం అనర్హులైన వైద్యుల సేవలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తుంది. కాని సరైన నిఘా లేకపోవడం వల్ల అనుమతులేని క్లినిక్స్ విస్తృతంగా పెరుగుతున్నాయి. ప్రయివేట్ ఆసుపత్రుల అధిక ఫీజుల దోపిడీని అరికట్టేం దుకు కస్టమర్ ప్రొటెక్షన్ చట్టం 2019 ఉంది. కాని ప్రజలు తమ హక్కుల గురించి అవగాహన లేకపోవడం వల్ల న్యాయపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకబడి ఉన్నారు.

తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి జిల్లాల్లో నిర్బంధ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి. ప్రజల అవగాహన కోసం ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. కఠిన శిక్షలు విధించడం ద్వారా చట్టాల అమలుకు మరింత బలాన్నిచ్చి, అనర్హులైన వైద్యుల్ని అడ్డుకోవాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా అన్ని ఆసుపత్రుల పర్యవేక్షణను బలోపేతం చేయాలి.

మహిళా అభయ రక్షక దళం గస్తీ

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు మహిళా అభయ రక్షక దళం ఆదివారం గస్తీ నిర్వహించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ పబ్లిక్ ప్రదేశాల్లో మహిళల, బాలికల పట్ల ఆకతాయిల వేధింపుల నివారణకు, ప్రజలకు అత్యవసర సమయాల్లో తక్షణ సహాయం కోసం డయల్ 112 ఉపయోగించవచ్చని వివరించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సెంట్రల్ సైబర్ సెల్ ద్వారా సమస్య పరిష్కారం పొందవచ్చని తెలిపారు. చుట్టుపక్కల అసాంఘిక కార్యకలాపాల సమాచారం 95550351100 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపవచ్చన్నారు. సమాచారదారుల గోప్యతను కాపాడతామని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వహించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రజల సహకారం కీలకమని తెలిపారు. సమాజ శ్రేయస్సుకు అందరూ బాధ్యతతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నమ్మకం పెంచి, సురక్షిత సమాజ నిర్మాణంలో మహిళా అభయ రక్షక దళం తమ బాధ్యతను నిర్వర్తించిందన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అక్రమంగా సస్పెన్షన్ చేసిన డ్రైవర్ ఎం.దాసును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నూజివీడు ఆర్‌టిసి గ్యారేజీ ఎదుట నూజివీడు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో మూడోరోజు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా రీజనల్ ప్రెసిడెంట్ కె.రాఘవ మాట్లాడుతూ అక్రమంగా సస్పెన్షన్ చేసిన ఎం.దాసును వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. సర్క్యులర్ 1/19 ఆర్‌టిసి కార్మికులకు అమలు చేయాలన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) డబుల్ డ్యూటీలు చేయదని, 1/19 సర్కులర్‌ను వెంటనే అమలు చేసి ఎం.దాసుపై సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకపోతే ఈ ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయి వరకు ఉధృతం చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్‌టిసి బస్సుల కండిషన్‌ను వెంటనే మెరుగు పరచాలన్నారు. ఆర్‌టిసీ కార్మికులు ఎంత భద్రతగా విధులు చేపట్టిన డ్రైవర్ గాని కండక్టర్ గాని తప్పు లేకపోయినా వారి మీద తప్పు చూపిస్తూ సస్పెన్షన్ చేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుమార్, ప్రెసిడెంట్ ఎం.చిరంజీవి, ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, రీజనల్ కమిటీ మెంబర్ ఎం.గంగాధరరావు, జాయింట్ సెక్రటరీ పిసిహెచ్.రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కె.మోబిన్, ప్రచార కార్యదర్శి ఎ.సతీష్, జిఎస్.రావు, ఎస్‌కె.ఇమాం సాహెబ్, ఎఎస్.రావు, ఎల్‌బి.నాయక్ పాల్గొన్నారు.

ఐద్వా కమిటీ కన్వీనర్‌గా లక్ష్మి

ప్రజాశక్తి - నూజివీడు

ఐద్వా నూజివీడు ఎంప్లాయిస్ కాలనీ కమిటీ కన్వీనర్‌గా మద్దాలి లక్ష్మి నియమితులయ్యారు. కమిటి సమావేశం ఆదివారం నిర్వహించారు. 20 మంది వరకు మహిళలు హాజరయ్యారు. ఏడుగురితో కాలనీ ఐద్వా కమిటీ ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. సదరు కమిటీకి మద్దాలి లక్ష్మి కన్వీనర్‌గా నియమితులయ్యారు. వారి మొదటి ఎజెండాగా డ్రెయినేజీ, మున్సిపల్ వాటర్, కోతులు, వీధి కుక్కల సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. కాలనీ పక్కనే బైపాస్ రోడ్డు ఉండడం వల్ల భారీ వాహనాలు కాలనీలోంచి వెళ్లడం, ఖాళీ స్థలాల్లో రాత్రిళ్ల కొంతమంది అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి చుట్టుపక్కల కుటుంబాలకు భయభ్రాంతులు కలిగిస్తున్నారన్నారు. సదరు సమస్యలపై కూడా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి కాలనీ సమస్యలు రూపుమాపాలని నిర్ణయించారు. ఈ సమావేశం ఐద్వా నూజివీడు పట్టణ అధ్యక్షురాలు నండూరి పద్మాంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు.

'గన్నవరం ఎంఎల్‌ఎ వ్యాఖ్యలు సరికావు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలు సరికావని టిడిపి నూజివీడు సీనియర్ నాయకులు పొట్లూరి సత్యనారాయణ, గోగినేని మధు, గద్దె రఘు, తుమ్మల ఆది, పొట్లూరి శాంతకుమార్ అన్నారు. నూజివీడులో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతుందని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎన్ని ముఖ్య కార్యక్రమాలున్నా నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ శ్రమిస్తున్న మంత్రి పాలనపై దుష్ప్రచారం చేస్తే, చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలం, అత్తిలి చెందిన కానుమిల్లి చినరుద్ర మంగారావు, S/o.విద్యాధరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు నెం.L8488745 గల పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం అత్తిలి గ్రామంలో జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుతుండగా నాయొక్క పాస్‌పోర్టు మార్గమధ్యలో పడిపోయింది. చుట్టు ప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

అడ్రస్ : కానుమిల్లి చినరుద్ర మంగారావు
S/o.కానుమిల్లి విద్యాధరరావు,
డోరునెం.2-101, రామన్నపేట, అత్తిలి,
అత్తిలి మండలం - 534134, ప.గో.జిల్లా.
సెల్: 9866286679